# అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి



మొయినాబాద్‌లోని నాగిరెడ్డిగూడలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య

- గ్రామాల్లో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం
- నామినేషన్ వేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్యయాదవ్
- కాంగ్రెస్, బీజేపీల తీరును ఎండగట్టిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్, నవంబర్ 7 : భవిష్యత్‌లో చేవెళ్ల ప్రాంతాన్ని జోన్‌ల వారీగా విభజించి హైదరాబాద్‌ను తలదన్నేలా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసిందని, ప్రతిపక్షాల మాటలు విని మోసపోవద్దని చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, బాకారం జాగీర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. మహిళలు పెద్ద ఎత్తున ఆయనకు మంగళ హారతితో ఘన స్వాగతం పలికారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ , బీజేపీ మాటలను ఎట్టి పరిస్థితిలో నమ్మవద్దని చెప్పారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే అందుబాటులో ఉండి సేవకునిగా మరిన్ని సేవలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ కొంపల్లి అనంతరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, అజీజ్‌నగర్ సర్పంచ్ సంధ్య, ఎంపీటీసీ సుజాత, నాగిరెడ్డిగూడ సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ అర్జున్, బాకారం సర్పంచ్ రాఘవరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహ్మా, సర్పంచ్‌లు ఆలూరి కుమార్, మనోజ్‌కుమార్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహ్మాగౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎంపరవూఫ్, మాజీ వైస్ చైర్మన్లు డప్పు రాజు, వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు రాము, రాజుగౌడ్, బిక్షపతిగౌడ్, సీనియర్ నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రవియాదవ్, కృష్ణారెడ్డి, గణేశ్‌రెడ్డి, శ్రీశైలం, రాజు, డేవిడ్, వడ్డె రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

**చేవెళ్ల రూరల్ :** పామెన గ్రామంలో బీఆర్ఎస్ ప్రచారం జోరందుకున్నది. ఎమ్మెల్యే కాలె యాదయ్య అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ఎంపీపీ విజయలక్ష్మిరమణారెడ్డి, జడ్పీటీసీ మాలతీకృష్ణారెడ్డి, సర్పంచ్ అక్నాపురం మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌తో కలిసి ఇంటింటికీ తిరుగు తూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే కాలె యాదయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శివ ప్రసా ద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకట రంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహులు, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శేరి శివారెడ్డి, మార్కె ట్ కమిటీ మాజీ చైర్మన్ శివ నీలచింటు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రైతు బంధు సమితి కౌకుంట్ల అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధా న కార్యదర్శులు నరేందర్ గౌడ్, హన్మంత్ రెడ్డి, సర్పంచ్‌లు శేరి స్వర్ణలతాదర్శన్, సామ మాణిక్యరెడ్డి, భీమయ్య, లావణ్యశంకర్, జహంగీర్, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోవద్దు**

చేవెళ్లటౌన్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చే మోసపూరిత హామీలను నమ్మవద్దని ఎంపీపీ విజయలక్ష్మి, జడ్పీటీసీ మాలతి అన్నారు. మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎన్నికలు రాగానే హామీలు ఇవ్వడం, అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కడం కాంగ్రెస్ పార్టీ స్వభావమన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే చేవెళ్ల ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, మాజీ ఎంపీపీ మంగలి బాల్‌రాజ్, మాజీ మండల అధ్యక్షుడు రమేశ్వర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహులు, మాజీ వైస్ చైర్మన్‌లు మాణిక్య రెడ్డి, నర్సింహులు, ముడిమ్యాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎర్ర మల్లేశ్, సర్పంచ్‌లు శివారెడ్డి, మాణిక్యరెడ్డి, మోహన్ రెడ్డి, మల్లారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి**

షాబాద్ : పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని కుమ్మరిగూడ సర్పంచ్ పోనమోని కేతన అన్నారు. మంగళవారం కుమ్మరిగూడ గ్రామంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో రమేశ్‌యాదవ్, కొత్తపల్లి వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి, బుక్క రవి, ఆవిలాశ్‌గౌడ్, తాళ్లపల్లి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పద్మారెడ్డి, అంజిరెడ్డి, శ్రీశైలం, గుడిసె రమేశ్, యాదయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

**కారు జోరు.. ప్రతిపక్షాలు బేజారు**

కొత్తూరు : కారు జోరును తట్టుకోలేక ప్రతిపక్షాలు బేజారు అవుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవేందర్‌యాదవ్ అన్నారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను గెలిపించాలని కోరుతూ కొత్తూరు మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ స్పీడును చూసి కాంగ్రెస్, బీజేపీ పార్టీల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొస్గి శ్రీనివాసులు, బీఆర్ఎస్ నాయకులు జంగగళ్ల శివకుమార్, రవినాయక్, వెంకటేశ్, ఆంజనేయులుగౌడ్, బాలు, లక్ష్మయ్య, శ్రీనివాస్‌చారి, విష్ణు, మహేశ్ పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ నాయకుల ప్రచారం**

కేశంపేట : మండలంలోని పోమాల్‌పల్లి, భైర్‌ఖాన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్యయాదవ్‌కు మద్దతుగా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గాదెకాడి కృష్ణయ్య, కృష్ణయ్యయాదవ్, నాయకులు యాదగిరిరావు, ద్రోణాచారి, యాదగిరియాదవ్, బాబుయాదవ్, అంజయ్యయాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నామినేషన్ వేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్




షాద్‌నగర్, నవంబర్7 : బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వడంతో పాటు అభివృద్ధి చేసి చూపించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వై. అంజయ్యయాదవ్ అన్నారు. సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు తమ కండ్ల ముందు కనిపిస్తుందని, అన్ని వర్గాల ప్రజలు మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని అన్నారు. మంగళవారం లింగారెడ్డిగూడలోని షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వాహణ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో వేల కోట్ల నిధులను వెచ్చించి అభివృద్ధి పనులను చేశామని చెప్పారు. పాత జాతీయ రహదారి విస్తరణ, ఇంటింటికీ మంచి నీళ్ల వసతి, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల మరమ్మతులు, అన్ని గ్రామాలకు, తాండాలకు బీటీ రోడ్ల నిర్మాణం, షాద్‌నగర్ పట్టణంలో సీసీ రోడ్లు, గ్రామాల్లో సీసీ రోడ్లు, ప్రజల అవసరాల కోసం 100 పడకల దవాఖాన, అడిటోరియం, మాడల్ మార్కెట్, వ్యవసాయ మార్కెట్ ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశామని వివరించారు. ముఖ్యంగా పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా షాద్‌నగర్ ప్రాంతానికి సాగు నీరు వచ్చేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణారెడ్డి, బెంది శ్రీనివాస్‌రెడ్డి, వంకాయల నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేందర్, న్యాయవాది రాజ్‌గోపాల్, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**ఆలయంలో పూజలు**

మహేశ్వరం మండలం గట్టుపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వై. అంజయ్యయాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. నామినేషన్ వేసే ముందు ఆయన ఇష్టదైవాన్ని కొలిచే క్రమంలో దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి వేద పండితుల ఆశీస్సులను పొందారు.ఆయన అభిమానులు సహితం షాద్‌నగర్ పట్టణంలోని చటాన్‌పల్లి కట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేశారు. కొత్తూరు మండలం జేపీ దర్గాలో షాద్‌నగర్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు గౌస్‌జానీ ప్రత్యేక ప్రార్థనలు చేసి ఎమ్మెల్యేగా గెలుపొందాలని ఆకాంక్షించారు. మైనార్టీ నాయకుడు మొగిలిగిద్ద సిరాజొద్దీన్ ఇమామే జామిన్‌ను కట్టి తన అభిమానాన్ని చాటుకున్నారు.

**అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల వివరాలు**

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఎన్నికల అధి కారులకు అందించిన అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలను పొందుపర్చారు. ప్రస్తు తం తన వద్ద రూ.35 వేల నగదు, తులం బంగారం ఉందని తెలిపారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బులు, ఆయన వద్ద ఉన్న కారు విలువ, బంగారం విలువ మొత్తం కలిపి రూ. 1.16 కోట్లు ఉన్నట్లు వెల్లడించారు. ఆయన భార్య లక్ష్మమ్మ పేరు మీదు ఉన్న మొత్తం ఆస్తి విలువ రూ. 19.23 లక్షలు. ఇందులో లక్ష్మమ్మ వద్ద రూ. 10 వేల నగదు, 30 తులాల బంగారం, కిలో వెండి, మహిళా సంఘం ఖాతాలో కొంత నగదు, పోస్టల్ లో జమచేసుకున్న రూ.6 వేల నగదు ఉన్నది. సొంత గ్రామం ఎక్లాస్‌ఖాన్‌పేటలో 370 గజాల్లో సొంత ఇల్లు ఉందని తెలిపారు. ఈ సంవత్సరం రూ. 4,08,750 ఆదాయ పన్ను చెల్లించినట్లు పేర్కొన్నారు.

## పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు



గులాబీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నవీన్‌రెడ్డి

నందిగాయ, నవంబర్ 7: బీఆర్ఎస్ షాద్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్యయాదవ్ గెలుపుకోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ నారగకుంట నవీన్‌రెడ్డి అన్నారు. నందిగామ మండలం మామిడిపల్లి ఎంపీటీసీ కట్న మాధవి రవీందర్, ఉప సర్పంచ్ హన్మంత్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ యాదగిరిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ, వార్డు సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, పద్మమ్మ, రత్నమ్మ, అరుణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు పార్టీలోని నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీలోకి మరిన్ని వలసలు కొనసాగుతాయని తెలిపారు.

## కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా పోటీచేస్తా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు సున్నపు వసంతం

షాబాద్, నవంబర్ 7: చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా పోటీలో ఉంటానని ఆ పార్టీ నాయకుడు సున్నపు వసంతం అన్నారు. మంగళవారం సాయంత్రం చేవెళ్ల మండల కేంద్రంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నియోజకవర్గంలో ఏండ్ల తరబడిగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తాను కృషి చేశానన్నారు. చేసిన సేవలను గుర్తించకుండా ఇతరులకు పార్టీ టికెట్ ఇచ్చి బీఫామ్ అందజేయడం సరికాదన్నారు. బుధవారం మధ్యాహ్నం 12గంటలకు చేవెళ్ల ఎమ్మెల్యే స్థానానికి రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తానని వసంతం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులున్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

మొయినాబాద్, నవంబర్ 7 : అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు పరిశీలించారు. మంగళవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్, సురేంగల్, వెంకటాపూర్, శ్రీరాంనగర్, వెంకటాపూర్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లి, ఎతుబార్‌పల్లి, తోలుకట్టా, అప్పారెడ్డిగూడ, సజ్జన్‌పల్లి, అప్పారెడ్డిగూడ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మొయినాబాద్ తహసీల్దార్ గౌతం వారి సిబ్బందితో కలిసి పరివీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రమోహన్, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్, సూజర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యంపై పకడ్బందీగా తనిఖీలు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు

షాద్‌నగర్‌టౌన్, నవంబర్ 07: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో షాద్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీగా మద్యం తనిఖీలు చేస్తున్నామని సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు తెలిపారు. షాద్‌నగర్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ హన్మంత్, సీఐ అంజన్‌కుమార్‌తో కలిసి మంగళవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న సందర్భంగా మద్యం ద్వారా ఓటర్లను ప్రభావితం చేస్తారని, అక్రమ మద్యం నిలువలపై ప్రత్యేక నిఘా పెట్టామని వివరించారు. ఇప్పటి వరకు రూ.24.97 లక్షల మద్యం, కల్లును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఫిర్యాదుల కోసం రాష్ట్ర ఎక్సైజ్ కంట్రోల్ రూం ఉంటుందని, ఫిర్యాదు చేయాల్సినవారు 18004252523 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.